సాక్షి
ఖమ్మం

మంగళవారం ၊ 16 ၊ ఏప్రిల్ ၊ 2024



నమ్మకం కోల్పోకుండా అభివృద్ధి
ప్రజల నమ్మకం కోల్పోకుండా రాజకీయాలకు అతీతంగా అభివృద్ధిచేశానని ఎంపీ, బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు తెలిపారు. 8లో



రిజర్వేషన్ల రద్దుకు కుట్ర
విద్యారంగంలో రిజర్వేషన్లు రద్దు చేసేందుకు కేంద్రప్రభుత్వం కుట్ర పన్నుతోందని ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ విమర్శించారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
42° / 25°
వాతావరణం
జిల్లా అంతటా మంగళవారం గరిష్టస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం వరకు వడగాలుల ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

బాలలపైనే దేశ భవిష్యత్



పిల్లలతో న్యాయమూర్తులు

ఖమ్మంలీగల్: దేశ భవిష్యత్ బాలలపైనే ఆధారపడి ఉందనే విషయాన్ని గుర్తించి వారిని స్వేచ్ఛగా ఎదగనివ్వాలని అదనపు జిల్లా న్యాయమూర్తి(కుటుంబ న్యాయస్థానం) ఎం.అర్చనాకుమారి సూచించారు. జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యాన సోమవారం ఖమ్మంలోని బాలల సదనాన్ని న్యాయమూర్తులు అర్చన కుమారి, మహమ్మద్ అబ్దుల్ జావేద్ పాషా సందర్శించారు.ఈ సందర్భంగా వారు పిల్లలకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేయగా.. అర్చనకుమారి చట్ట సంబంధ అంశాలను సులభ రీతిలో అర్థమయ్యేలా పిల్లలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సదనం పర్యవేక్షకురాలు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

సాంకేతిక శిక్షణ సంస్థలో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంవన్‌టౌన్: మహిళ సాంకేతిక శిక్షణ సంస్థలో శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి కె.రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. అనాథలు, నిరాశ్రయులైన ఆడపిల్లలు, అక్రమ రవాణాకు గురైన బాధితులు, బాలల సదనం, మహిళా సంస్థల్లో ఆశ్రయం పొందిన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పదో తరగతి పాసైన వారు, పాలిసెట్ ప్రవేశ పరీక్ష రాయని వారు కూడా అర్హులని తెలిపారు. డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్, డిప్లొమా ఇన్ సివిల్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ కంప్యూటర్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజనీర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనుండగా దరఖాస్తులతో పాటు ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలు సమర్పించాలని సూచించారు.ఈ మేరకు దరఖాస్తులను నూతన కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో మే 19వ తేదీలోగా సమర్పించాలని ఆయన తెలిపారు.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

సత్తుపల్లిటౌన్: దేశ భవిష్యత్ యువత చేతిలోనే ఉందని.. ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటు హక్కును అర్హులంతా వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సూచించారు. సత్తుపల్లిలోని జేవీఆర్ కళాశాలలో ఓటరు చైతన్య కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం ఎలక్ట్రోరల్ లిటరసీ క్లబ్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 18ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు విధిగా ఓటు వేయాలని సూచించారు. ఎన్నికల వేళ ప్రలోభాలకు గురిచేసే వారి వివరాలను సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేసేలా స్థానికులకు అవగాహన కల్పించాలని చెప్పారు. తహసీల్దార్ యోగేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపల్ విజయకుమార్‌తో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన

వేంసూరు: రానున్న లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ప్రతీ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బంది ఎదురుకాకుండా అన్ని వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సూచించారు. వేంసూరు మండలం చౌడవరం, పల్లెవాడ, వైఎస్ బంజర్, అడసర్లపాడు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలతో పాటు చౌడవరం, పల్లెవాడలో ఇంటింటి ఓటరు నమోదును ఆయన పరిశీలించారు. ఆతర్వాత చౌడవరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సైతం తనిఖీ చేశారు. తహసీల్దార్ ఎం.ఏ.రాజు, ఆర్ఐ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్



కలెక్టరేట్‌లోని హెల్ప్‌డెస్క్

ఖమ్మం సహకారనగర్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యాన ఈనెల 18వ తేదీ నుంచి కలెక్టరేట్‌లో నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా నామినేషన్ల దాఖలుకు వచ్చే వారికి సమాచారం ఇవ్వడంతో పాటు సందేహాలు నివృత్తి చేసేలా కలెక్టరేట్‌లో రెండు వైపులా రెండు హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశారు. కాగా, హెల్ప్‌డెస్క్‌ల వద్ద కలెక్టర్ గౌతమ్ సూచనలతో పోలింగ్ తేదీ, సీ-విజిల్ ప్రత్యేకత, ఓటరు హెల్ప్‌లైన్ యాప్, నామినేషన్ వేసే దాఖలు చేసేందుకు కావాల్సిన పత్రాల వివరాలతో ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు.

వైభవం.. ధ్వజారోహణం

శాస్త్రోక్తంగా పూర్తయిన వేడుక
- సంతాన ప్రాప్తి కోసం మహిళలకు గరుడ ప్రసాదం
- భేరీపూజతో ముక్కోటి దేవతలకు ఆహ్వానం
- నేడు కల్యాణంలో కీలక ఘట్టమైన ఎదుర్కోలు ఉత్సవం





వేదా మండపంలో అగ్ని ప్రతిష్ఠ పూజలు చేస్తున్న అర్చకులు (ఇన్‌సెట్) మహిళలకు గరుడ ప్రసాదం అందజేస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన ధ్వజారోహణ వేడుకను ఆలయ అర్చకులు సోమవారం వైభవంగా నిర్వహించారు. శ్రీ మహా విష్ణువుకు ప్రీతిపాత్రుడైన గరుత్మంతుడి చిత్రపటాన్ని తెల్లటి వస్త్రంపై చిత్రించి ధ్వజస్తంభంపై ఎగురవేశారు. ఉదయం యాగశాలలో తిరువారాధన, సేవా కాలం, నివేదన, మంగళాశాసనం, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఎలాంటి విఘ్నాలు కలగకుండా ఉండేందుకు సేనాధిపతి, విఘ్ననాశకుడు అయిన విష్వక్సేన అర్చన గావించి, పుణ్యాహవాచనం, మూర్తి కుంభావాహన, భద్రక మండల ఆరాధన, ద్వార తోరణ ఆరాధన నిర్వహించి నవాహ్నిక దీక్షకు అగ్ని ప్రతిష్ఠాపన చేశారు. గరుడ పటంతో యాగశాల నుంచి ఆలయం చుట్టూ ప్రదక్షిణగా తీసుకొచ్చి ఆరాధన చేశారు. గరుడ మహా సంకల్పం, గరుడ గద్యనం, గరుడ మంగళాష్టకాలను ప్రధానార్చకులు పఠించగా, మంగళ వాయిద్యాల నడుమ ధ్వజారోహణం గావించారు. అనంతరం బలిహరణం చేసి, సంతానం లేనివారికి గరుడముద్దలను ప్రసాదంగా అందజేశారు. ఈ గరుడ ముద్ద తీసుకున్న వారికి సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. ఈ ప్రసాదాన్ని స్వీకరించేందుకు మహిళా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఇక సాయంత్రం యాగశాలలో భేరీ పూజ నిర్వహించి.. శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవానికి ముక్కోటి దేవతలను ఆహ్వానించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ఈఓ ఎల్. రమాదేవి దంపతులు, ఏఈఓలు శ్రవణ్‌కుమార్, భవాని రామకృష్ణ, ఆలయ ప్రధాన అర్చకులు పొడిచేటి సీతా రామానుజాచార్యులు, విజయరాఘవన్, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, వేదపండితులు గుడిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

మా వంశమే గొప్పదంటూ..


'అందమైన మా రామయ్య వంశమే గొప్పది' అంటూ ఆయన తరఫు అర్చకులు ఒకవైపు.. 'కాదు.. కాదు.. మా చక్కనైన సీతమ్మ తల్లి వంశమే గొప్పది' అంటూ మరోవైపున అమ్మవారి తరఫు అర్చకులు.. ఇలా లయబద్ధంగా నాట్యమాడుతూ సరదాగా సాగే ఎదుర్కోలు వేడుకలకు మంగళవారం సాయంత్రం మిథిలా స్టేడియం వేదిక కానుంది. శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవానికి ఘడియలు సమీపిస్తున్న తరుణంలో కీలక ఘట్టమైన ఎదుర్కోలు ఉత్సవానికి ఆలయ అర్చకులు, అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. హిందూ సంప్రదాయం ప్రకారం జరిగే ప్రతీ కల్యాణంలోనూ ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తారు. ఇక ఆదర్శ జంటకు ప్రతీకలైన శ్రీ సీతారాముల తిరు కల్యాణం సందర్భంగా స్వామి, అమ్మవార్ల వంశాల గొప్పదనాన్ని వివరించే ఈ వేడుక అద్యంతం భక్తులకు కనువిందు చేస్తుంది. మిథిలా స్టేడియం సీతమ్మ వారికి మిథిలా నగరం కాగా, మరో పక్కనున్న వైకుంఠ ద్వారం రామయ్యకు చెందిన అయోధ్యగా అభివర్ణిస్తూ పండితులు కనులపండువగా ఈ వేడుక జరుపుతారు. అలాగే హిందూ, ముస్లింల మధ్య సామరస్యాన్ని పెంపొందించేలా భక్తులందరికీ పన్నీరు చల్లడం ఈ ఉత్సవంలో మరో ప్రత్యేకత. గోల్కొండ నవాబైన తానీషాను స్మరింపజేస్తూ భద్రాచలం దేవస్థానంలో ఈ సంప్రదాయాన్ని ఇప్పటికీ కొనసాగించడం విశేషం. కాగా, నవాహ్నిక తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం, గురువారం పట్టాభిషేకం వేడుకలు జరపనున్నారు.

రామయ్య కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో బుధ, గురువారం జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణం, పట్టాభిషేక మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని, భక్తులు ఇబ్బంది పడకుండా అన్ని సౌకర్యాలు కల్పించామని దేవాదాయ, పౌర సంబంధాల శాఖ కమిషనర్ హనుమంతరావు తెలిపారు. కల్యాణోత్సవం జరగనున్న మిథిలా స్టేడియంలో ఏర్పాట్లను సోమవారం ఆయన భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆలతో కలిసి పరిశీలించి మాట్లాడారు. చలువ పందిళ్లు, తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, ఎస్పీ రోహిత్‌రాజ్, ఆలయ ఈఓ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మంట మండుతోంది..


- జిల్లాలో గరిష్టస్థాయి ఉష్ణోగ్రతలు
- అత్యధికంగా నేలకొండపల్లిలో 43.4 డిగ్రీలు..
- మిగతా చోట్ల కూడా 40 డిగ్రీలకు పైగానే...



ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. జిల్లావ్యాప్తంగా ఆరెంజ్ అలర్ట్ కొనసాగుతుండగా.. 40 నుంచి 45 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రత నమోదవుతోంది. సోమవారం 40 నుంచి 42 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు అల్లాడిపోయారు.

హెచ్చుతగ్గులు

ఈ ఏడాది వేసవిలో ఉష్ణోగ్రతలు కొంత హెచ్చుతగ్గులతో కొనసాగుతున్నాయి. ఫిబ్రవరి నుంచి ఎండల తీవ్రత ప్రారంభం కాగా.. మార్చి ఆరంభంలో 32 నుంచి 34 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రత నమోదు కావాల్సి ఉన్నా ఈసారి మాత్రం 35 నుంచి 39 డిగ్రీల మధ్య నమోదైంది. మునుపెన్నడూ లేని విధంగా రాష్ట్రవ్యాప్తంగా పోలిస్తే జిల్లాలోనే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మార్చి మూడో వారానికి 40 డిగ్రీలు దాటగా, ఏప్రిల్ మొదటి వారంలో మరింతగా పెరిగాయి. ఏప్రిల్ 7న నేలకొండపల్లిలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదుకాగా.. అతర్వాత మధ్యలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఉష్ణోగ్రత కాస్త తగ్గుముఖం పట్టింది. మళ్లీ ఈనెల రెండో వారం నుంచి సగటున 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతుండడం ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది.



విద్యుత్ వినియోగం పైపైకి..

ఉష్ణోగ్రతల స్థాయిలోనే విద్యుత్ వినియోగం సైతం పెరుగుతోంది. ఏప్రిల్ మొదటి వారంలో 5.80 నుంచి 5.87 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదుకాగా.. ఏప్రిల్ 13న 5.19 మిలియన్ యూనిట్లకు తగ్గింది. మళ్లీ ఇప్పుడు వినియోగం పెరుగుతోంది. ఇందులో భాగంగా సోమవారం జిల్లాలో 5.55 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగినట్లు అంచనా. యాసంగి పంటల సాగు దాదాపు పూర్తికావడంతో వ్యవసాయ విద్యుత్ వినియోగం తగ్గగా, ఉష్ణోగ్రతల కారణంగా గృహ వినియోగం మాత్రం పెరుగుతోంది.

సోమవారం అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన ప్రాంతాలు (డిగ్రీ సెల్సియస్‌లో)

ప్రాంతం	ఉష్ణోగ్రత
నేలకొండపల్లి	43.4
బచ్చోడు, కాకరవాయి	42.7
బాణాపురం	42.5
ఖమ్మం	42.4
కూసుమంచి	42.4
రావినూతల	42.3
పెనుబల్లి	42.2
గేట్ కారేపల్లి	42.1
తిమ్మారావుపేట	42.0
నాగులవంచ	42.0
వమ్మి	42.0

కనుల పండువగా శ్రీవారి కల్యాణం



శ్రీవారి కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు



పట్టువస్త్రాలు, తలంబ్రాలతో వస్తున్న డీపీఓ, తదితరులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న ఎర్రుపాలెం మండలం జమలాపురంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. కల్యాణమూర్తులైన స్వామి, అమ్మవార్లను అర్చకులు వేదికపైకి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అతర్వాత భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయం నుంచి తీసుకొచ్చిన ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలను జిల్లా పంచాయతీ అధికారి హరికిషన్, ఆలయ ఈఓ కె.జగన్మోహన్‌రావు సమర్పించారు. అనంతరం అర్చకులు కురవి వేంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, రాజీవ్‌శర్మ ఆధ్వర్యాన కల్యాణ క్రతువు పూర్తిచేశారు. పెద్దసంఖ్యలో హాజరైన భక్తులు చేసిన గోవింద నామ స్మరణతో ఆలయం మార్మోగింది. గ్రామోత్సవం అనంతరం పెద్ద చెరువులో శ్రీవారి తెప్పోత్సవం నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సొసైటీ చైర్మన్ ముల్పూరి శ్రీనివాసరావు, దాతలు తుళ్లూరు కోటేశ్వరరావు, సూపరింటెండెంట్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

18నుంచి నామినేషన్ల స్వీకరణ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

- అభ్యర్థితో పాటు మూడు వాహనాలకే అనుమతి
- కలెక్టర్ వీ.పీ.గౌతమ్

ఖమ్మం సహకారనగర్: లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల పర్వం ఈనెల 18న ప్రారంభం కానుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశమై మాట్లాడారు. ఈనెల 18 నుండి 25 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, 21వ తేదీ ఆదివారం మినహా మిగతా రోజుల్లో ఉదయం 11నుండి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. ఈమేరకు అభ్యర్థికి సంబంధించి మూడు వాహనాలు మాత్రమే అనుమతిస్తారని, మిగతా వాహనాలు 100 మీటర్ల దూరంలో ఉండాలని చెప్పారు. అలాగే, రిటర్నింగ్ అధికారి చాంబర్‌లోకి ఐదుగురికి మాత్రమే అనుమతి ఉందన్నారు. అనంతరం ప్రతిపాదకుల అర్హత, కొత్త బ్యాంక్ ఖాతా తెరవడం, సెక్యూరిటీ డిపాజిట్ తదితర అంశాలను వెల్లడించారు. అంతేకాక ఎన్నికల సభలు, ర్యాలీల కోసం 48గంటల ముందు సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఏర్పాట్లలో వేగం పెంచండి

ఎన్నికల నోటిఫికేషన్ ఈనెల 18న విడుదల కానున్న నేపథ్యాన నామినేషన్ల స్వీకరణ ఏర్పాట్లలో వేగం పెంచాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. కలెక్టరేట్ నుంచి ఏఆర్‌ఓలు, తహసీల్దార్లతో నామినేషన్లు, ఓటరు సహాయక కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. నామినేషన్ సహాయక కేంద్రాలను ఏర్పాటుచేసి నామినేషన్ల ఘట్టం ముగిశాక వాటినే ఓటరు సహాయక కేంద్రాలుగా కొనసాగించాలన్నారు. అలాగే, 85ఏళ్లు పైబడిన వారికి హోం ఓటింగ్ అవకాశం కోసం గుర్తించాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో జెడ్పీ సీఈఓ, ఎంపీడీఓలు బాధ్యత వహించాలని కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశాల్లో అసిస్టెంట్ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, జెడ్పీ సీఈఓ వినోద్, డీటీఓ సత్యనారాయణ, డీపీఓ విజయ నిర్మల, జిల్లా ఉపాధికల్పన అధికారి కె.శ్రీరామ్, డీఆర్డీఓ సన్యాసయ్య, జిల్లా సహకార అధికారి మురళీధర్‌రావు, ఎల్‌డీఎం శ్రీనివాసరెడ్డి, ఉద్యోగులు అరుణ, రాళ్లబండి రాంబాబు, మదన్‌గోపాల్, మీనన్, రాంబాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడా తాగునీటి సమస్య రావొద్దు

ప్రభుత్వ కార్యదర్శి సురేంద్రమోహన్



కొణిజర్లలో ట్యాంక్‌ను పరిశీలిస్తున్న సురేంద్రమోహన్, అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్/వైరా/కొణిజర్ల: ఎక్కడ కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని.. ఇందుకు అనుగుణంగా అధికారులు పర్యవేక్షించాలని ఉమ్మడి జిల్లా తాగునీటి సరఫరా పర్యవేక్షణ ప్రత్యేక అధికారి, ప్రభుత్వ కార్యదర్శి కె.సురేంద్రమోహన్ సూచించారు. ఖమ్మం దానవాయిగూడెం ఫిల్టర్‌బెడ్ వద్ద నీటి నిల్వలను సోమవారం ఆయన అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పాలేరు జలాశయం నుంచి విడుదల చేసిన నీటిని తాగు అవసరాలకే ఉపయోగిస్తూ, ఎక్కడా వృథా కాకుండా పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం రామన్నపేట, శాంతినగర్ పాఠశాలలను తనిఖీ చేసి వసతులపై ఆరా తీసిన సురేంద్రమోహన్.. ఆతర్వాత లకారం ట్యాంక్ బండ్‌కు వెళ్లి నీటి నిల్వను పరిశీలించారు. కాగా, వైరాలో రిజర్వాయర్‌ను సైతం పరిశీలించగా, నిల్వ ఉన్న నీరు మరో 45 రోజుల వరకు సరిపోతుందని మిషన్ భగీరథ అధికారులు తెలిపారు. ఇక కొణిజర్ల మండలంలోని చిన్నగోపతి, కొణిజర్లలోనూ అదనపు కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి పర్యటించిన సురేంద్రమోహన్ చిన్నగోపతి ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలోని సౌకర్యాలు పరిశీలించారు. ఆపై పీహెచ్‌సీని తనిఖీ చేసి వడదెబ్బ నివారణ మందులు అందుబాటులో ఉండాలని సూచించారు. అక్కడే లక్ష లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్ ట్యాంక్‌ను పరిశీలించి నీరు సరఫరాపై ఆరాతీస్తుండగా.. ఓ మహిళ నీటి సరఫరా సరిగా జరగడం లేదని తెలిపారు. దీంతో వెంటనే సమస్య పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరిని ఆదేశించారు. అసిస్టెంట్ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రంజిత్ కుమార్, మున్సిపల్ ఈఈ కృష్ణలాల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సదాశివకుమార్, ఈఈ పుష్పలత, వివిధ శాఖల అధికారులు నర్సింహమూర్తి, నవీన్, మణిశంకర్, సతీష్‌కుమార్, చైతన్య కుమార్, తఫజల్ హుస్సేన్, ఏ.రోజారాణి, డాక్టర్ సైదులు, ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'నవమి'కి ప్రత్యేక బస్సులు

- భద్రాచలానికి 238 సర్వీసులు
- ఏపీ నుంచి సైతం 150 ప్రత్యేక బస్సులు
- భద్రాచలం నుంచి పర్ణశాలకు ఐదు నిమిషాలకో బస్సు
- 'ఆపరేషన్'పై డీఎంలతో ఖమ్మం ఆర్ఎం సమీక్ష



ఆర్టీసీ బస్సులు

ఖమ్మంమయూరిసెంటర్: భద్రాచలంలో అత్యంత వైభవంగా జరగనున్న శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణాన్ని తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచే కాక పక్క రాష్ట్రాల నుంచి సైతం భక్తులు తరలివస్తారు. ఈనెల 17న శ్రీరామనవమి రోజున భద్రాచలం మిథిలా స్టేడియంలో జరిగే స్వామివారి కల్యాణం, 18న జరగనున్న పట్టాభిషేకానికి హాజరయ్యే భక్తుల కోసం టీఎస్ ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఎలాంటి ఇబ్బంది కలగకుండా సర్వీసులు నడిపేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు. మంగళవారం నుంచి 18వ తేదీ వరకు 238 ప్రత్యేక బస్సులను టీఎస్ ఆర్టీసీ నడిపించనుండగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఏపీఎస్ఆర్టీసీ మరో 150 నుంచి 170 బస్సుల వరకు ఆ రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భద్రాచలానికి నడిపిస్తుంది.

ఏపీ నుంచి భారీగా భక్తుల రాక

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణాన్ని తిలకించేందుకు ఆంధ్రప్రదేశ్ నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారు. ఈ నేపథ్యాన ఏపీఎస్ఆర్టీసీ సైతం అక్కడి నుంచి భద్రాచలానికి ప్రత్యేక బస్సులు నడిపించనుంది. విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడ, అమలాపురం, ఏలూరు, గోకవరం, తిరువూరు నుంచి 150 నుంచి 170 బస్సులు నడిపించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఏపీ నుంచి వచ్చే రెగ్యులర్ బస్సులే కాక ప్రత్యేక బస్సులను నిలిపేందుకు, ప్రయాణికులను ఎక్కించుకునేందుకు భద్రాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ప్రత్యేక పాయింట్ ఏర్పాటు చేశారు. భద్రాచలం బస్టాండ్‌లో రద్దీ కారణంగా ఇబ్బందులు ఎదురుకాకుండా కళాశాల మైదానాన్ని ఏపీఎస్ఆర్టీసీ పాయింట్‌గా ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే, కళాశాలలో దిగిన భక్తుల కోసం కరకట్ట వరకు మినీ బస్సులను నడిపిస్తారు. రూ.10 చెల్లించి ఈ బస్సుల్లో ఎక్కడైనా ఎక్కి ఎక్కడైనా దిగే వెసులుబాటు కల్పించారు.

పర్ణశాలకు బస్సులు

భద్రాచలం బస్టాండ్ నుంచి పర్ణశాల వరకు నడుపుతున్న రెగ్యులర్ సర్వీసులతో పాటు, ప్రయాణికుల రద్దీని తట్టుకోడానికి ప్రతీ ఐదు నిమిషాలకో బస్సు నడిపించాలని నిర్ణయం తీసుకున్నారు. కాగా, ఖమ్మం రీజియన్ నుంచి ఆపరేట్ చేసే రెగ్యులర్ సర్వీసులు, ప్రత్యేక సర్వీసులన్నీ భద్రాచలం బస్టేషన్ వరకు వచ్చి వెళ్తాయి. కాగా, అన్ని బస్సుల్లో మహిళా ప్రయాణికులకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తారు. ఇక కొత్తగూడెం నుంచి భద్రాచలానికి ఎక్కువ బస్సులు తిప్పేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. అంతేకాక హైదరాబాద్ సెక్టార్ నుంచి వచ్చి వెళ్లే ప్రయాణికుల కోసం రిజర్వేషన్ల ఆధారంగా బస్సుల సంఖ్య పెంచే అవకాశముంది.

అధికారులతో ఆర్ఎం సమీక్ష..

శ్రీరామనవమి సందర్భంగా ప్రత్యేక బస్సులు నడిపించనున్న నేపథ్యాన ఖమ్మం రీజనల్ మేనేజర్ చెరుకుపల్లి వెంకన్న సోమవారం ఖమ్మం కొత్త బస్టాండ్‌లో రీజినల్ పరిధిలోని డిపో మేనేజర్లతోపాటు ఏపీఎస్ఆర్టీసీ అధికారులతో సమీక్షించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు వచ్చే భక్తుల్లో ఎక్కువ మంది ఆర్టీసీ బస్సులను ఎంచుకుంటారని తెలిపారు. దీంతో భక్తులకు అసౌకర్యం కలగకుండా సమయానుకూలంగా బస్సులు నడిపించాలని, అధికారులు తమకు కేటాయించిన పాయింట్లలో ఉండి పర్యవేక్షించాలని ఆదేశించారు. వైద్యాధికారులు కూడా భక్తులకు, ఆర్టీసీ సిబ్బందికి అందుబాటులో ఉండాలని తెలిపారు. రద్దీ నేపథ్యాన ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సెక్యూరిటీ సిబ్బందిని నియమిస్తున్నామని, తాగునీరు, టాయిలెట్ల సౌకర్యం కూడా కల్పిస్తున్నామని ఆర్ఎం వెల్లడించారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా..

శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవానికి వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా టీఎస్ ఆర్టీసీ సర్వీసులు నడిపించేందుకు ఏర్పాట్లు చేసింది. గత ఏడాది అనుభవాలను పరిగణనలోకి తీసుకోవడంతో పాటు మహాలక్ష్మి పథకం నేపథ్యాన మహిళా భక్తులు అధికసంఖ్యలో వస్తారన్న అంచనాలతో బస్సులు సిద్ధం చేశారు. శ్రీరామనవమి సందర్భంగా నడిపించే ప్రత్యేక బస్సుల్లో అదనపు చార్జీలు లేకపోగా.. మహిళలకు ఉచిత ప్రయాణం వర్తించనుంది. రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపేందుకు డిపో మేనేజర్లు, ఇతర అధికారులకు బాధ్యతలు అప్పగించారు. టీఎస్ ఆర్టీసీ నడిపే 238 బస్సుల్లో ఖమ్మం రీజియన్‌కు సంబంధించినవి 208 ఉండగా.. వరంగల్, నల్లగొండ, కరీంనగర్ డిపోల నుంచి పది చొప్పున 30 బస్సులను జిల్లాకు రప్పించనున్నారు.

పాయింట్ల వారీగా విధులు నిర్వర్తించనున్న అధికారులు

ప్రదేశం	అధికారి	సెల్ నంబర్
భద్రాచలం	డిపో మేనేజర్, మధిర	99592 25961
	డిపో మేనేజర్, భద్రాచలం	99592 25960
పర్ణశాల	డిపో మేనేజర్, మణుగూరు	99592 25963
ప్రభుత్వ కాలేజ్ మైదానం	డిపో మేనేజర్, సత్తుపల్లి	99592 25962
కొత్తగూడెం	డిపో మేనేజర్, కొత్తగూడెం	99592 25959
ఖమ్మం	డిపో మేనేజర్, ఖమ్మం	99592 25958
మణుగూరు	ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్	73828 58121
సత్తుపల్లి	ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్	63035 61217
మధిర	ట్రాఫిక్ సూపరింటెండెంట్	87900 14668

క్లుప్తంగా

విద్యార్థులకు సర్టిఫికెట్లు



సర్టిఫికెట్లు అందచేస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన ఇటీవల ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను నిర్వహించారు. ఇందులో భాగంగా వ్యాసరచన, పోస్టర్ తయారీ, స్లోగన్ రైటింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కలెక్టర్ గౌతమ్ సోమవారం నగదు బహుమతులతో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. ఎల్‌డీఎం శ్రీనివాసరెడ్డి, డీఈఓ సోమశేఖరశర్మ, ఆర్‌ఎంఓ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీపీఆర్‌ఎస్ బలోపేతానికి కట్టుబడి ఉన్నాం..

ఖమ్మంమామిళ్లగూడెం: ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ స్థాపించిన రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ బలోపేతానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని పార్టీ జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావీద్ తెలిపారు. ఖమ్మంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం ప్రజాప్రతినిధులకు నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. నాయకులు కిరణ్ ముగ్గు భూత్సన్, రాచమల్ల సిద్ధేశ్వర్, ఈశాల రాజేష్, దొబ్బల సౌజన్య, ఫాతిమా జోహరా, కమర్తపు మురళి, గజ్జెల లక్ష్మి, రఫీదా ముస్తఫా, రావూరి కరుణ, వడ్డే నారాయణ పాల్గొన్నారు.

భీమవరం వాసికి డాక్టరేట్



ప్రసాద్

ఎర్రుపాలెం: మండలంలోని భీమవరానికి చెందిన బొబ్బిళ్లపాటి ప్రసాద్‌కు డాక్టరేట్ లభించింది. ఆయన సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి మధ్యప్రదేశ్‌లోని శ్రీసత్యసాయి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ప్రసాద్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని సీఎంఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

ముగిసిన అప్రెంటిస్ షిప్

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 30 మంది ల్యాబ్ టెక్నీషియన్ల ఏడాది అప్రెంటిస్ షిప్ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా వారికి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు సర్టిఫికెట్లు అందజేశారు. ఈకార్యక్రమంలో సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్, ఆర్‌ఎంఓ బి.ఆమర్‌సింగ్, ఎంసీహెచ్ సూపరింటెండెంట్ బాబు రత్నాకర్, సూపరింటెండెంట్ రాంబాబు, వైస్ ప్రిన్సిపాల్ సరిత తదితరులు పాల్గొన్నారు.

టీ.టీ. అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గంలో స్థానం



బాలసాని విజయ్‌కుమార్



ఓలేటి సాంబమూర్తి

ఖమ్మం స్పోర్ట్స్: టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఖమ్మంకు చెందిన బాలసాని విజయ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ప్రస్తుతం జిల్లా కార్యదర్శిగా వ్యవహరిస్తున్న ఓలేటి సాంబమూర్తికి స్థానం దక్కింది. ఈసందర్భంగా వీరిని డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్ రెడ్డి, అసోసియేషన్ బాధ్యులు డాక్టర్ ఎంజీవీ ప్రవీణ్, డాక్టర్ కృష్ణ సుమంత్, డాక్టర్ రవికుమార్, డాక్టర్ జొన్నలగడ్డ శశికుమార్, డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, రాయల సతీష్, ఉపేందర్, జోజి దాకో, రెడ్డిసాయి శివ, శ్రావ్య, చలపతి, బట్టు ప్రేమ్‌కుమార్, కామేశ్వరి భవ్య, పవన్ తదితరులు అభినందించారు.

ప్రభుత్వ ఆస్తి ధ్వంసం చేసిన కేసులో రెండేళ్ల జైలు

ఖమ్మం లీగల్: తిరుమలాయపాలెం మండలం జూపెడలో సీసీ రోడ్డును ధ్వంసం చేసిన ఎలక వెంకటేశ్వర్లుకు రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.గోపిక నాగ శ్రావ్య సోమవారం తీర్పు చెప్పారు. జూపెడలో ప్రభుత్వ ఆదేశాల మేరకు 2017 మార్చి 6న సిమెంట్ రోడ్డు వేయగా.. రాత్రి 11 గంటల సమయాన వెంకటేశ్వర్లు తన ఇంటి ఎదుట 10 మీటర్ల మేర రోడ్డును ధ్వంసం చేశారు. ఘటనపై వి.హన్మంతరావు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసును విచారణలో వెంకటేశ్వర్లుపై నేరం రుజువు కావడంతో జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.నర్సయ్య వాదించగా.. లైజన్ ఆఫీసర్ ఎల్.భద్రునాయక్ సహకరించారు.

వికసించిన కృష్ణ కమలం!



నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురంలో దండా సత్యనారాయణ ఇంట్లో అరుదైన కృష్ణ కమలం (కౌరవ–పాండవ) పూవు సోమవారం వికసించింది. మూడేళ్లకోసారి మాత్రమే పూవు పూసే ఈ మొక్కను ఆయన హైదరాబాద్ తీసుకొచ్చి నాటారు. కౌరవులు, పాండవులు, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు, శ్రీకృష్ణుడి రూపాలు ఈ పుష్పంలో ఉంటారని పలువురు నమ్ముతారు.

రారండోయ్.. వేడుక చూద్దాం



ఖమ్మం కిన్నెర సెంటర్‌లో ఏర్పాటుచేసిన హోర్డింగ్

దక్షిణ అయోధ్యగా పేరు గాంచిన భద్రాచలంలో శ్రీ సీతారాముల కల్యాణోత్సవానికి సర్వం సిద్ధమైంది. ఈనెల 17న బుధవారం కల్యాణ మహోత్సవం, 18న స్వామి వారి పట్టాభిషేకం జరగనుంది. ఈ సందర్భంగా అధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా హోర్డింగ్‌లు ఏర్పాటుచేశారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్



ఖమ్మం స్టేషన్ వద్ద ఫ్లెక్సీ

● శ్రీరామనవమికి సిద్ధం

ఈనెల 17న శ్రీరామనవమి సందర్భంగా ఊరూవాడ శ్రీ సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఖమ్మంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా సీతారాములు, లక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహాలను అమ్మకానికి ఉంచారు. వీటిని కల్యాణ మండళ్ల బాధ్యులు కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్



సీతారాముల కల్యాణానికి నారికేళ కళాకృతులు

సమర్పించిన హైదరాబాద్ వాసి రాధారాణి




అలయానికి సమర్పించిన నారికేళ కళాకృతులు, (ఇన్‌సెట్) రాధారాణి



ముదిగొండ: ముదిగొండ మండలం ముత్తారంలో శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించే శ్రీ సీతారాముల కల్యాణానికి హైదరాబాద్‌కు చెందిన భక్తురాలు వి.రాధారాణి ప్రత్యేక నారికేళ కళాకృతులను రూపొందించారు. వీటిని ఆమె ఆలయ అర్చకులు బొర్రా వాసుదేవాచార్యులకు సోమవారం అందజేశారు. ఈ కళాకృతులను రూపొందించేందుకు నెల పాటు నుంచి రాత్రింబవళ్లు శ్రమించగా.. చాన్నాళ్లు నిల్వ ఉండే కేరళ బొండాలపై దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన పూసలు, ముత్యాలతో సిద్ధం చేసినట్లు ఆమె తెలిపారు. స్వామివారి పాదసేవలో భాగంగా వీటిని తయారు చేయగా, రాధారాణిని ఆలయ కమిటీ బాధ్యులు తుళ్లూరు జీవన్, శాకి వీరభద్రం, వి. వెంకటేశ్వరరావు, ఆలయ శాశ్వత ధర్మకర్త వి.వెంకటనాగేశ్వరరావు అభినందించారు.

కాయ్ రాజా కాయ్..

- జోరుగా ఐపీఎల్ బెట్టింగ్
- గ్రామీణ ప్రాంతాల్లోనూ పందేల హోరు



ఖమ్మం స్పోర్ట్స్: ఐపీఎల్ మ్యాచ్‌ల హోరుకు తగినట్లుగానే జిల్లాలో బెట్టింగ్ కొనసాగుతోంది. చిన్నాపెద్ద తేడా లేకుండా పలువురు ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లపై బెట్టింగ్ కాస్తున్నారు. రూపాయితో రూ.వంద సంపాదించాలనే ఆశతో బెట్టింగ్‌కు దిగుతుండగా.. ఒకరిద్దరు తప్ప మిగతా వారు జేబులు ఖాళీ చేసుకుంటున్నారు.

పరుగులు.. విజయాలు

ఏ రోజు ఏ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతుందనే విషయం ముందుగానే షెడ్యూల్ విడుదలైంది. దీంతో ఫేవరెట్‌గా ఉన్న జట్లు.. అందులోని క్రీడాకారుల ఆటతీరు ఆధారంగా బెట్టింగ్ సాగుతోందని సమాచారం. బెట్టింగ్ కాసి గెలిస్తే రూపాయికి పదింతలు వస్తాయని నిర్వాహకులు ఆశ చూపుతున్నారు. దీంతో మ్యాచ్‌ల్లో గెలుపోటములపైనే కాక ప్రతీ బంతికి, వికెట్‌తో పాటు ఫోర్లు, సిక్సర్లపైనా బెట్టింగ్ కాస్తున్నారు. టీవీల్లో మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారం చూస్తూ బెట్టింగ్ కాస్తుండగా.. గతంలో నగరాలకే పరిమితమైన ఈ వ్యసనం ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకూ పాకిందని తెలుస్తోంది. అయితే, నిర్వాహకులు వాట్సాప్ ద్వారా వ్యవహారం నడిపిస్తూ నగదు లావాదేవీలను ఫోన్ పే, గూగుల్ పే ద్వారా కొనసాగిస్తున్నారు.

రెస్టారెంట్లు, బార్లే వేదికలు

జిల్లాలోని ప్రధాన నగరాల్లో రెస్టారెంట్లు, బార్లు బెట్టింగ్‌కు వేదికలుగా నిలుస్తున్నాయని తెలుస్తోంది. మందుబాబులను ఆకట్టుకునేలా బార్లలో భారీ స్క్రీన్లు బిగించి మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు చేశారు. దీంతో మద్యం మత్తులో జోరుగా పందేలు కాస్తున్నట్లు తెలిసింది. గతంలో ఐపీఎల్ పందెం కారణంగా అప్పుల పాలైన ఖమ్మంకు చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అలాంటి ఘటనలు జరగకుండా, అమాయకులు నష్టపోకుండా బెట్టింగ్‌లను నియంత్రణపై అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

- పరారీలో సత్యపేట శిబిరం నిర్వాహకులు
- ఖాతాల్లోని రూ.7,66,443 నగదు ఫ్రీజ్ చేశాం : ఏసీపీ రఘు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రఘు

సత్తుపల్లి టౌన్: క్రికెట్ బెట్టింగ్ పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కల్లూరు ఏసీపీ ఏ.రఘు స్పష్టం చేశారు. సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సత్తుపల్లి మండలం సత్యపేటలోని బెట్టింగ్ శిబిరంపై ఆదివారం సత్తుపల్లి, టాస్క్‌ఫోర్స్ పోలీసుల ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టి నలుగురిని అరెస్టు చేశామని తెలిపారు. బెట్టింగ్ నిర్వాహకులు ఏగోటి పెద్దిరాజు, శివ, అవినాష్, చిన్న, శ్రీధర్, రాము, సూర్య, ఎస్‌కే.రఫీ, మాస్టర్, డీపీ, సాయి పరారీలో ఉన్నారని చెప్పారు. కాగా, నిర్వాహకులకు సంబంధించి మూడు బ్యాంక్ అకౌంట్లు రూ.7,66,443ను ఫ్రీజ్ చేసినట్లు చెప్పారు.

పేకాట శిబిరంపై దాడి

సత్తుపల్లి మండలంలో యాతాలకుంట – చంద్రాయ్యపాలెం మధ్య అడవిలో పేకాట శిబిరంపై సోమవారం తనిఖీ చేయగా ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఏసీపీ రఘు తెలిపారు. వీరి నుంచి రూ.39,640తో పాటు సెల్‌ఫోన్లు, బైక్‌లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈసమావేశంలో సత్తుపల్లి, టాస్క్‌ఫోర్స్ సీఐలు కిరణ్, జె.రామకృష్ణ పాల్గొన్నారు.

రిజర్వేషన్ల రద్దుకు కేంద్రం కుట్ర




మేనిఫెస్టోతో విద్యా పరిరక్షణ కమిటీ నాయకులు

ఖమ్మం సహకారనగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నూతన విద్యావిధానం పేరిట అణగారిన వర్గాల రిజర్వేషన్లు రద్దు చేసేందుకు కుట్ర పన్నిందని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ విమర్శించారు. ఖమ్మంలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన అఖిల భారత విద్యాహక్కుల వేదిక రూపొందించిన పీపుల్స్ మేనిఫెస్టోను విడుదల చేశారు. అనంతరం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రైవేట్ విద్యాసంస్థలకు పూర్తి స్వేచ్ఛ ఇస్తోందని ఆరోపించారు. ఇకనైనా విద్య రంగానికి 15శాతం బడ్జెట్ కేటాయించాలని, నూతన విద్యావిధానాన్ని రద్దు చేయడమే కాక ప్రాథమిక స్థాయి నుంచి యూనివర్సిటీ వరకు అన్ని విద్యాసంస్థల్లో ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.విజయ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బాబురావు, వి.మనోహర్‌రాజు, అక్క రామారావు, నాగేశ్వరరావు, సురేష్, రాకేష్, ఆజాద్, వెంకటేష్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ వచ్చింది లేరా.. కన్నా

- నీటి సంప్‌లో పడి చిన్నారి మృతి
- కన్నీరుమున్నీరుగా విలపించిన కుటుంబీకులు



యశ్వంత్ (ఫైల్)



యశ్వంత్ మృతదేహంతో రోదిస్తున్న తల్లి

వైరారూరల్: ఆడుకుంటూ వెళ్లి ఇంటి ఆవరణలోని నీటి సంప్‌లో ప్రమాదవశాత్తు పడిన చిన్నారి మృతి చెందాడు. వైరా మండలం కనకగిరి సిరిపురంలో సోమవారం రాత్రి వెలుగుచూసిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. కనకగిరి సిరిపురం గ్రామానికి చెందిన కూరకుల గోపి – భవాని దంపతులకు నాలుగేళ్ల కుమారుడు మణికంఠతో పాటు 16నెలల కుమారుడు యశ్వంత్ ఉన్నారు. గోపి ఆటోడ్రైవర్‌గా పని చేస్తుండగా కుటుంబ పోషణలో పాలుపంచుకునేందుకు భవాని వారం క్రితమే వైరాలోని ఒక బట్టల దుకాణంలో చేరింది. వీరిద్దరు పనులకు వెళ్తే పిల్ల లను చూసుకునేందుకు నెమలి గ్రామానికి చెందిన భవాని తల్లి భద్రమ్మ వచ్చింది. రోజులాగే గోపి, భవానీ పనులకు వెళ్లగా భద్రమ్మ తన ఇద్దరు మనవళ్లు మణికంఠ, యశ్వంత్ ఆడుకుంటుండగా ఇంట్లో నిద్రించింది. ఆ సమయాన యశ్వంత్ ఇంటి ఆవరణలో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు ఇంటి ముందు ఉన్న నీటి సంప్‌లో పడినట్లు తెలుస్తోంది. కాసేపయ్యాక భద్రమ్మ మనవడు యశ్వంత్ కోసం ఎక్కడ వెతికినా ఆచూకీ లేకపోవడంతో తన కుమార్తె, అల్లుడికి సమాచారం ఇచ్చింది. వారు చేరుకుని పరిసర ప్రాంతాలు, ఇంట్లో గాలిస్తుండగా యశ్వంత్ మృతదేహం నీటి సంప్‌లో తేలియాడుతూ కనిపించింది. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పనికి వెళ్లి రాగానే తనను ఎదురొచ్చే కుమారుడు విగతజీవిగా మారడంతో భవానీ 'అమ్మ వచ్చింది లేరా.. కన్నా' అంటూ విలపించిన తీరు స్థానికులను సైతం కంటతడి పెట్టించింది.

ప్రజల నమ్మకం కోల్పోకుండా అభివృద్ధి

బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు



సమ్మేళనంలో మాట్లాడుతున్న నామ నాగేశ్వరరావు తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన తాను కష్టపడి ఎదిగానని.. రెండు సార్లు తనను గెలిపించిన ప్రజల నమ్మకం కోల్పోకుండా రాజకీయాలకతీతంగా పని చేశానని, జిల్లాకు అభివృద్ధి నిధులు సాధించానని బీఆర్‌ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు వెల్లడించారు. ఖమ్మంలోని బ్యాంక్ కాలనీలో సోమవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాజకీయాలకు రాకముందు నుంచే తన తండ్రి నామ ముత్తయ్య పేరుతో ట్రస్ట్ ఆధ్వర్యాన సేవా కార్యక్రమాలు నిర్వహించానని తెలిపారు. ఆపై రాజకీయాల్లోకి వచ్చాక కూడా ప్రజలకు సేవ చేశానని చెప్పారు. మరోమారు ఖమ్మం ఎంపీగా తనను గెలిపిస్తే జిల్లాకు అత్యధికంగా నిధులు సాధించడంతో పాటు ప్రజల సమస్యలపై పార్లమెంట్‌లో మాట్లాడుతానని తెలిపారు. ఈసమావేశానికి మోతారపు సుధాకర్ అధ్యక్షత వహించగా, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్, నాయకులు తాళ్లూరి జీవన్, వీరూనాయక్, మోతారపు శ్రావణి, మోరంపూడి ప్రసాద్, వెంకటాచారి, చిత్తారు సింహాద్రి యాదవ్, రాజేష్, చీకటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలు ప్రాంతాల్లో ప్రజలను కలిసిన ఎంపీ నామా తనను గెలిపించాలని కోరారు.

కుమారుడిపై తల్లి ఫిర్యాదు

ఖమ్మంక్రైం: తండ్రి మరణానికి కారణం కావడంతో పాటు ఆస్తి విషయమై తన చిన్న కుమారుడు దౌర్జన్యం చేస్తున్నాడని ఖమ్మం రామన్నపేటకు చెందిన సయ్యద్ చాంద్‌బీ సోమవారం సీపీ సునీల్‌దత్‌కు ఫిర్యాదుచేసింది. దీంతో ఆయన విచారణ జరపాలని సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు.

బీసురాజుపల్లి దేవాలయంలో హుండీ చోరీ

తిరుమలాయపాలెం: మండలంలోని బాలాజీనగర్ తండా గ్రామపంచాయతీ పరిధి బీసురాజుపల్లి శ్రీ సీతారామచంద్రస్వామి ఆయలంలో హుండీని ఆదివారం అర్ధరాత్రి దుండగులు ఎత్తుకెళ్లారు. గుర్తుతెలియని వ్యక్తులు ఆటోలో వచ్చి హుండీని తీసుకెళ్లినట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. ఆ హుండీని కొద్ది దూరంలో పగులగొట్టి నగదు తీసుకెళ్లారు. ఘటనపై సోమవారం ఉదయం ఆలయ కమిటీ చైర్మన్ మూనావత్ వీరన్న ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్సై గిరిధర్‌రెడ్డి, క్లూస్‌టీం సిబ్బంది చేరుకుని సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించారు.

టిప్పర్ క్యాబిన్‌లో మంటలు

ముదిగొండ: టిప్పర్ క్యాబిన్‌లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకోగా వాహనం పూర్తిగా కాలి పోయింది. ముదిగొండ మండలం న్యూలక్ష్మీపురంలో ఆదివా రం అర్ధరాత్రి చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు... మండలంలోని ఖానాపురం నుంచి న్యూలక్ష్మీపురం వెళ్తున్న టిప్పర్ క్యాబిన్‌లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకున్నాయి. మంటలు అంతకంతకూ పెరుగుతుండగా అప్రమత్తమై డ్రైవర్ కిందకు దిగాడు. దీంతో త్రుటిలో ప్రమాదం తప్పగా, టిప్పర్ క్యాబిన్‌తో పాటు టైర్లు దగ్ధమయ్యాయి.

దావత్ ఇస్తామని పిలిచి దాడి

కారేపల్లి: రంజాన్ దావత్ ఇస్తామని పిలిచిన కొందరు తనపై దాడి చేశారని కారేపల్లికి చెందిన కేశవరావు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేశవరావును ఇల్లెందుకు చెందిన స్నేహితులు రంజాన్ సందర్భంగా దావత్ ఇస్తామని పిలిచారు. దీంతో ఆయన ఇల్లెందుకు వెళ్లగా పాతకక్షలను మనసులో పెట్టుకుని దాడి చేశారు. ఈక్రమంలో తప్పించుకుని వస్తుండగా గుట్టకిందిగుంపు గ్రామం వద్ద అటకాయించి మరోమారు దాడి చేయగా గ్రామానికి చేరుకున్నాడు. అనంతరం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నాక కేశవరావు సోమవారం ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి



బాబురావు (ఫైల్)

రఘునాథపాలెం: వడదెబ్బ బారిన పడిన మండలంలోని వి.వెంకటాయపాలెంకు చెందిన చేబ్రోలు బాబూరావు (48) సోమవారం మృతి చెందాడు. మధ్యాహ్న భోజనం తర్వాత నిద్రించిన ఆయన నిద్రలోనే మృతి చెందాడని గ్రామస్తులు తెలిపారు. ఆయన భార్య ఐదేళ్ల క్రితం మృతి చెందగా, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

టిప్పర్ డ్రైవర్ ఆత్మహత్య



వెంకన్న (ఫైల్)

రఘునాథపాలెం: అప్పులు పెరగడంతో టిప్పర్ డ్రైవర్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రఘునాథపాలెం సీఐ శ్రీహరి వెల్లడించిన వివరాలు... ఖమ్మం బాలపేటకు చెందిన వెంకన్న(40) టిప్పర్ డ్రైవర్‌గా పనిచేసేవాడు. రెండేళ్లుగా దురలవాట్లకు బానిసైన ఆయన కుటుంబ పోషణను పట్టించుకోకుండా తిరుగుతుండడంతో పద్ధతి మార్చుకోవాలని కుటుంబీకులు చెప్పినా వినలేదు. ఈ మేరకు అప్పులు పెరగడంతో ఆందోళనకు గురైన వెంకన్న సోమవారం ఉదయం విధులకు వెళ్తున్నట్లు చెప్పి రఘునాథపాలెం శివారులోని చేనులో వేప చెట్టుకి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై ఆయన భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కాగా, వెంకన్న ఆన్‌లైన్‌లో బెట్టింగ్ కోసం అప్పులు చేసినట్లు తెలిసింది.

మామిడి తోటలు, మొక్కజొన్న పంట దగ్ధం

చింతకాని: గుర్తుతెలియని వ్యక్తులు రహదారి పక్కన చెత్తకు నిప్పు పెట్టడంతో మంటలు ఎగిసిపడి మామిడి తోటలు, మొక్కజొన్న కాలిపోయాయి. మండలంలోని నాగులవంచలో సోమవారం ఈ ఘటన జరగగా.. రైతు నరేష్, సామినేని బాబురావు, నంబూల నర్సింహారావుకు చెందిన మామిడి తోటలు, కౌలు రైతుకు దేశబోయిన నాగేశ్వరరావు చెందిన మొక్కజొన్న పంటకు మంటలు అంటుకున్నాయి. ఖమ్మం అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చేలోగా రూ.10 లక్షల మేర ఆస్తినష్టం జరిగిందని రైతులు వాపోయారు.

వరిగడ్డి వాములు..

కల్లూరురూరల్: మండలంలోని చిన్నకోరుకొండి, కిష్టయ్యబంజర్ గ్రామాల్లో మూడు వరిగడ్డి వాములు దగ్ధమయ్యాయి. చిన్నకోరుకొండిలో దుర్గం యోహాన్, దుర్గం మోషే, కిష్టయ్యబంజర్‌లోని పసుపులేటి శ్రీనుకు చెందిన ఆదివారం రాత్రి అర్ధరాత్రి కాలిపోగా, రూ.1.30 లక్షకు పైగా ఆస్తినష్టం జరిగిందని తెలిపారు. ప్రమాద సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది చేరుకునేలా గడ్డి కాలి బూడిదైందని పేర్కొన్నారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

ఖమ్మంరూరల్: మండలంలోని ఆటోనగర్‌కు చెందిన వివాహిత అల్లిక కవిత (28) సోమవారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చింతకాని మండలం పాతర్లపాడుకు చెందిన పున్నారావుతో కొణిజర్ల మండలం రామనర్సయ్యనగర్‌కు చెందిన కవితకు 11ఏళ్ల క్రితం వివాహం జరిగింది. అతర్వాత పున్నారావు ఆటోనగర్‌కు చేరుకుని ఆర్‌ఎంపీ పనిచేస్తుండగా, ఇటీవల ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి కూడా గొడవ జరగగా కవిత సోదరుడు వచ్చి సర్దిచెప్పి వెళ్లాడు. అనంతరం ఆమె తెల్లవారుజామున ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. అపస్మారకస్థితిలోకి వెళ్లిన కవితను ఖమ్మం తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కవిత సోదరుడి ఫిర్యాదుతో ఆమె భర్త, అత్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామారావు తెలిపారు.